వరిలో జింక్ ధాతు లోపం నివారణకు

చర్యలు చేపట్టాలి

వికారాబాద్ డీఏవో గోపాల్

దోమలో వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి గోపాల్

దోమ, మార్చి 12 : వరిలో జింక్ ధాతు లోపం నివారణను అరికట్టేందుకు రైతులు ప్రత్యేక చర్యలు తీసుకొని తమ పంటలను కాపాడుకునేలా కృషి చేయాలని వికారాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ అన్నారు. మంగళవారం దోమ గ్రామంలోని యాసంగి వరి పంట పొలాలను ఏఈవో కావ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాసంగి వరి పంటలో జింక్ ధాతు లోపం ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున రైతులు వెంటనే గమనించి ఫార్ములా-6 (చిలేటెడ్ జింక్)ను వరి పంటపై స్ప్రే చేయాలని సూచించారు.

పోషకాహారంపై అవగాహన

పోషకాహారంపై అవగాహన కలిస్తున్న సీడీపీవో వినీతాదేవి

పెద్దఅంబర్‌పేట, మార్చి 12 : పౌష్టికాహారంపై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని సీడీపీవో వినీతాదేవి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 23 వరకు నిర్వహించే పోషకాహార పక్షోత్సవాల్లో భాగంగా పెద్దఅంబర్‌పేటలోని అంగన్‌వాడీ కేంద్రం-3లో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐసీడీఎస్ ద్వారా అందిస్తున్న పోషకాహారంపై అందరూ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. టీచర్లు, చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను అందించడంతో పాటు ఆరోగ్యవంతమైన భవిష్యత్‌ను అందించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కల్యాణి, టీచర్లు నిర్మల, గిరిజ, ఉమ, వెంకమ్మ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై ఎస్‌వోటీ పోలీసుల దాడి

9 మంది అరెస్టు, రూ.77,000, 10 మొబైల్స్ స్వాధీనం

పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

యాచారం, మార్చి 12 : పేకాట ఆడుతున్న శిబిరంపై మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న 9 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.77,000, 10 మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నారు. సీఐ శంకర్‌కుమార్ కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని ఓ కోళ్లఫారం వద్ద కొంతమంది పేకాడుతున్నట్లు పక్కాగా సమాచారం అందుకున్న మహేశ్వరానికి చెందిన ఎస్‌వోటీ పోలీసులు పేకాట శిబిరంపై మూకుమ్మడిగా దాడులు నిర్వహించారు. పేకాటాడుతున్న మేడిపల్లికి చెందిన పబ్బత్ శ్రీమన్, చెర్లపటేల్‌గూడకు చెందిన పంది మైసయ్య, యాచారంకు చెందిన ముదిరెడ్డి కొండల్‌రెడ్డి, ఇబ్రహీంపట్నంకు చెందిన జక్క కరుణాకర్‌రెడ్డి, ముత్యాల రాజు, యాచారంకు చెందిన కొమ్మినేని నారాయణ, మొండిగౌరెల్లికి చెందిన కొలన్ శివారెడ్డి, గుర్రం రంజిత్‌రెడ్డి, తుర్కయాంజాల్‌కు చెందిన దుగ్యాల మహేశ్‌లను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పేకాటరాయుళ్లను యాచారం పోలీసులకు అప్పగించారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీఐ లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

మూగజీవాలను కబేళాలకు తరలిస్తున్నవారిని

కఠినంగా శిక్షించాలి

విశ్వహిందూ పరిషత్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు భోజిరెడ్డి

చేవెళ్లటౌన్, మార్చి 12 : మూగజీవాలను అక్రమంగా కబేళాలకు తరలిస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు చేగూరి భోజిరెడ్డి, గోరక్షదళ్ రాష్ట్ర సభ్యుడు రాఘవ్‌జీ గోమాత అన్నారు. అక్రమంగా పశువులను కబేళాలకు తరలిస్తున్న వాహనాన్ని విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ నాయకులు మంగళవారం చేవెళ్లలో పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెక్ పోస్టులను ఏర్పాటు చేసి పశువులను కాపాడాలని పోలీసులను కోరారు. తెలంగాణలో పశువుల రక్తం ఏరులై పారుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూగజీవాలను అక్రమంగా తరలిస్తే సహించేది లేదని వారు పేర్కొన్నారు.

కబేళాలకు అక్రమంగా తరలిస్తున్న మూగజీవాలు

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శశాంక, సంబంధిత అధికారులు

రంగారెడ్డి, మార్చి 12 (నమస్తే తెలంగాణ) : పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి భారత ఎన్నికల సంఘం ద్వారా ఏ క్షణంలోనైనా షెడ్యూల్ వెలువడే అవకాశం ఉన్నందున ఎన్నికల నిర్వహణ కోసం అన్ని విధాలుగా సన్నద్ధమై ఉండాలని, ఎన్నికల ఏర్పాట్లను మరింత ముమ్మరం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్లు, అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల నిర్వహణ అంశాలపై సుదీర్ఘ సమీక్ష జరిపారు. ఓటరు నమోదు, మార్పులు-చేర్పులకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన, వాటి సత్వర పరిష్కారం, 18-19 వయస్సు కలిగిన యువతను ఓటరు జాబితాలో పేర్లు నమోదు కోసం దరఖాస్తులు చేయించడం, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, మోడల్ పీఎస్‌ల ఏర్పాటు, మృతి చెందిన, వలస వెళ్లిన ఓటర్ల విషయంలో చేపట్టాల్సిన చర్యలు, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఎన్నికల సిబ్బంది నియామకం, వారికి శిక్షణ తరగతులు నిర్వహించడం, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ర్యాండమైజేషన్, భద్రతా పరమైన ఏర్పాట్లు తదితర అంశాలను సమీక్షిస్తూ.. జిల్లా ఎన్నికల అధికారులకు మార్గనిర్దేశం చేశారు. గత ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరిగిన పోలింగ్ కేంద్రాలను గుర్తించి, ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. సెక్టోరల్ అధికారులచే సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల జాబితాను సేకరించాలని, వాటి వివరాలను సకాలంలో పంపించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని ఇప్పటికే నియమించినట్లయితే శనివారం మొదటి ర్యాండమైజేషన్ జరపాలని, ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను కూడా ఒకే రోజున, ఒకే సమయంలో అన్ని జిల్లాల్లో చేపట్టాలని సూచించారు. ఎన్నికల సిబ్బందికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ సదుపాయం అందుబాటులో ఉండేలా చూడాలని, పోస్టల్ బ్యాలెట్ వసతి కల్పించలేదని ఏ ఒక్కరు కూడా ఫిర్యాదు చేసేందుకు ఆస్కారం కల్పించవద్దని సూచించారు.

ప్రతిపాదనలు పంపాలి

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ శశాంక సంబంధిత ఈఆర్‌వోలతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచనల ప్రకారం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా పూర్తి చేయాలని, ఓటరు జాబితా తయారీ, 1500 కంటే ఎక్కువ ఓటర్లు ఒక పోలింగ్ కేంద్రంలో ఉంటే సహాయక పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలన్నారు. నివాసముండే ప్రాంతాలకు రెండు కిలోమీటర్ల దూరంలో పోలింగ్ కేంద్రాలుంటే అలాంటి వాటిని కూడా గుర్తించి మార్చుటకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్సులో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో

అక్రమ నిర్మాణాల కూల్చివేత

హిమాయత్‌నగర్‌లో ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన ప్రికాస్ట్‌ను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

- 8 ఎకరాలను స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు
- గ్రామస్తులకు ఇండ్ల పట్టాల స్థలంలో కూడా ప్రభుత్వ బోర్డు ఏర్పాటు
- చిలుకూరు రెవెన్యూలోని ప్రభుత్వ భూమిలో నిర్మించిన నిర్మాణం కూల్చివేత

మొయినాబాద్, మార్చి 12 : ప్రభుత్వ భూములను కబ్జా చేసి అక్రమంగా నిర్మాణం చేపట్టడంతో రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపారు. భూముల చుట్టూ వేసుకున్న ప్రీకాస్ట్‌ను సైతం జేసీబీలతో ధ్వంసం చేశారు. ఇండ్ల నిర్మాణాల పిల్లర్లను తొలగించారు. పోలీసుల పహారాలో కూల్చివేతల పర్వం కొనసాగింది. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామ రెవెన్యూలో హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నం.151లో (అసైన్డ్) 3.15 గుంటల భూమిని గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కబ్జా చేశారు. అందులో ఉన్న చెట్లను తొలగించి చుట్టూ గ్రీన్ మ్యాట్ కట్టి లోపలి నుంచి ప్రీకాస్ట్ చేశారు. రెవెన్యూ అధికారులకు అందిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ గౌతంకుమార్ ఆర్ఐలు రోజా, చంద్రమోహన్‌తో కలిసి పోలీసుల పహారాలో ప్రహరీని జేసీబీల సహాయంతో పూర్తిగా తొలగించారు. అనంతరం ప్రభుత్వ భూమి అని బోర్డు ఏర్పాటు చేశారు. అదే సర్వే నంబర్‌లో 5 ఎకరాల స్థలంలో గ్రామస్తులకు ఇండ్ల స్థలాల కోసం అని లేఅవుట్ చేయడంతో అందులో కూడా ప్రభుత్వ బోర్డును ఏర్పాటు చేసి స్వాధీనం చేసుకున్నారు. హిమాయత్‌నగర్ రెవెన్యూలో మొత్తం సుమారుగా 8 ఎకరాల వరకు స్వాధీనం చేసుకున్నారు.

తహసీల్దార్‌పై దురుసుగా ప్రవర్తించిన ఓ వ్యక్తి

చిలుకూరు రెవెన్యూలోని సురభి వెంచర్‌ను ఆనుకుని ప్రభుత్వ భూమి ఉన్నది. వెంచర్‌ను ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమంగా భవనాన్ని నిర్మిస్తున్నారని గ్రామస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా.. ఆయన నిర్మాణాన్ని పరిశీలించారు. భవనం ఒక పిల్లర్ ప్రభుత్వ భూమిలోకి వచ్చిందని పిల్లర్‌ను తొలగించారు.

ప్రభుత్వ భూమి సర్వే నం. 277లో కబ్జాకు గురైందని అక్కడ ఉన్నవారు చెప్పడంతో ప్రభుత్వ భూమిని పరిశీలించేందుకు తహసీల్దార్ వెళ్లారు. ప్రభుత్వ భూమి ఎక్కడి వరకు వస్తుందని సర్వేయర్‌ను, ఆర్ఐని తహసీల్దార్ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ఎలా కట్టారని తహసీల్దార్ అంటుండగా.. సదరు ఇంటి యాజమాని వచ్చి కబ్జా ఎలా అంటారని తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగాడు. సదరు ఇంటి యాజమాని ఎవరు పట్టినా ఆగకుండా తహసీల్దార్‌ను పరుశపదజాలంతో పాటు చేయి చేసుకోవడానికి పైపైకి వెళ్లాడు. తానేంటో తడాఖా చూపిస్తానని, తాను ఎల్ఎల్‌బీ చేస్తున్నా.. ఏమి అనుకుంటున్నావు అని తహసీల్దార్‌ను బెదిరించాడు. ప్రభుత్వ భూమిని ఎవరు కబ్జా చేసినా సహించేది లేదని, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ గౌతంకుమార్ హెచ్చరించారు.

ఓయూలో పలు కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 12 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పలు కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ గడువును పొడిగించినట్లు ఓయూ పరీక్షల విభాగం, కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫీజును ఈ నెల 16వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించవచ్చన్నారు. రూ.200 అపరాధ రుసుముతో 22వ తేదీ వరకు చెల్లించవచ్చని తెలియజేశారు. అన్ని ఫ్యాకల్టీల పీహెచ్‌డీ కోర్స్ వర్క్ (ప్రీ పీహెచ్‌డీ) పరీక్షా ఫీజును ఈ నెల 29వ తేదీలోగా సంబంధిత డీన్ కార్యాలయాల్లో చెల్లించాలని పేర్కొన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

పలు కోర్సుల పరీక్షా ఫలితాలు విడుదల

ఓయూ పరిధిలోని పలు కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు తెలిపారు. ఎంబీఏ మూడో సెమిస్టర్ రెగ్యులర్, ఎంఈ, ఎంటెక్ కోర్సుల రెండో సెమిస్టర్ మెయిన్, మొదటి, మూడో సెమిస్టర్ మేకప్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

యువకుడికి కత్తి పోట్లు

బండ్లగూడ, మార్చి 12 : హోటల్‌లో పని చేసే యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో దాడి చేశారు. ఈ ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి కథనం ప్రకారం.. అత్తాపూర్ స్టార్ హోటల్‌లో పనిచేసే యువకుడు నితీష్ తన పనులను ముగించుకుని ఇంటికి వెళ్తుండగా.. నందిముస్తాయిగూడ వద్ద అతడిపై గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు కత్తితో దాడి చేశారు. ఈ దాడిలో నితీష్ కత్తి పోట్లకు గురయ్యాడు. స్థానికులు ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని.. బాధితుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మున్నూరు కాపు సంఘ భవనానికి రూ.20 కోట్లు కేటాయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కొండ దేవయ్య

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య

శంషాబాద్ రూరల్, మార్చి 12: మున్నూరు కాపులకు జనాభా ప్రకారం నిధులు కేటాయించాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శంషాబాద్‌లో రంగారెడ్డి జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు గాదె రాజశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవయ్య మాట్లాడుతూ.. మున్నూరు కాపులకు జనాభా ప్రకారం నిధులు కేటాయించి వారిని ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మున్నూరు కాపు సంఘానికి ఆత్మగౌరవ భవన నిర్మాణం చేయడంతో పాటు రూ.20కోట్లు కేటాయించాలని కోరారు. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మున్నూరు కాపులకు రాజ్యసభలో, ఎమ్మెల్సీలుగా నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలన్నారు. తెలంగాణలో మున్నూరు కాపులు వెనుకబడి ఉన్నట్లు తెలిపారు. వారిని ఆదుకోవడం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు ఎమ్మెల్యేలను కలిసి వినతిపత్రాలు ఇచ్చే కార్యక్రమాలు త్వరలో చేపడుతామని తెలిపారు. 33 జిల్లాల్లో ప్రతి జిల్లా కేంద్రంలో ప్రతి జిల్లాకు రెండు ఎకరాల భూమితో పాటు హాస్టల్ భవనాల నిర్మాణాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఆవుల శ్రావణ్ పటేల్, భూనూరి శివశంకర్, లింగమయ్య, జుర్కి రమేశ్‌లతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

వాచ్‌మన్ ఇంట్లో చోరీ

బడంగ్‌పేట, మార్చి 12 : ఇంట్లో దొంగలు పడి నగదు, బంగారం ఎత్తుకెళ్లిన ఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ కథనం ప్రకారం.. వనపర్తి జిల్లాకు చెందిన పద్మ, హన్మంతు దంపతులు. రెండేండ్ల కిందట బతుకు దెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చి, హస్తినాపురంలోని బిల్డర్ శ్రీనివాస్ మోహన్ వద్ద వాచ్‌మన్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం తెల్లవారు జామున దుండగులు వీరి ఇంట్లోకి చొరబడి.. రూ.3 లక్షలు విలువజేసే బంగారం, మొబైల్ ఫోన్ ఎత్తుకెళ్లారు. ఈ దంపతులకు ఇద్దకు పిల్లలకు సంబంధించిన ఎడ్యుకేషన్ సర్టిఫికెట్లు కూడా దొంగలు ఎత్తుకెళ్లారు. కూతురు పెండ్లి కోసం ఇంట్లో దాచిన డబ్బును సైతం ఎత్తుకెళ్లారంటూ బాధితులు మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అభివృద్ధికి పాటుపడాలి

బండ్లగూడ, మార్చి 12: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆస్తి పన్నుపై అవగాహన కల్పించేందుకు వెళ్లిన కమిషనర్ శరత్‌చంద్రను తమ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు నిలదీశారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆస్తి పన్ను చెల్లించాలని కమిషనర్ శరత్‌చంద్ర శివసాయినగర్ కాలనీలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, ఆస్తి పన్ను చెల్లించి కార్పొరేషన్ అభివృద్ధికి పాటుపడాలని కోరారు.

మూసీ నాలాలో బాలుడు..

కాపాడిన స్థానికులు

చాదర్‌ఘాట్, మార్చి 12 : మూసీ నాలాలో అనుమానాస్పద స్థితిలో ఉన్న ఓ బాలుడిని స్థానికులు బయటకు తీసుకొచ్చి చాదర్‌ఘాట్ పోలీసులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆజంపురా ప్రాంతానికి చెందిన జోహెబ్ హందాన్(8) మంగళవారం చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూసానగర్ వద్ద మూసీ కాలువలో స్థానికులకు కనిపించాడు. వెంటనే స్థానికులు బాలుడిని బయటకు తీసుకొచ్చి స్నానం చేయించి చాదర్‌ఘాట్ పోలీసులకు అప్పగించారు. అదే సమయంలో జోహెబ్ ఆచూకీ కోసం ఫిర్యాదు చేసేందుకు చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాలుడి తాత ఎం.ఏ.జబ్బార్‌కు బాలుడిని అప్పగించారు. సరైన సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించి జోహెబ్‌ను మూసీ నది ప్రవాహంలో కొట్టుకుపోకుండా కాపాడిన స్థానికులను పలువురు అభినందించారు.

నకిలీ పాస్‌పోర్టు కేసులో..

ముగ్గురు ఏఎస్ఐలకు బెయిల్ మంజూరు

నాంపల్లి కోర్టులు, మార్చి 12 (నమస్తే తెలంగాణ): నకిలీ పాస్‌పోర్టు కేసులో మీసేవ యజమాని కొప్పిశెట్టి కళ్యాణ్, మారేడ్‌పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న తిప్పన్న, పంజాగుట్ట ట్రాఫిక్ ఏఎస్ఐ షేక్‌నజీర్ భాషా, వెంకటేశ్వర్లుకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ.. మంగళవారం 6వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీ చేశారు. రూ15వేల చొప్పున ఇద్దరి పూచీకత్తును జమానత్‌గా కోర్టుకు సమర్పించాలని, ప్రతి శుక్రవారం సీఐడీ కార్యాలయానికి వెళ్లి సంతకం చేయాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు. కస్టడీలో నలుగురు నిందితులు తెలిపిన వివరాల ప్రకారం.. అధికారులు చెన్నైకు పయనమయ్యారు. ఈ కేసుతో సంబంధమున్న మరికొందరిని అదుపులోకి తీసుకోనున్నారు. ప్రధాన నిందితుడు సత్తార్‌తో ఏర్పడిన పరిచయాల వల్ల శ్రీలంక జాతీయులకు భారత పాస్‌పోర్టులను తయారు చేసి విదేశాలకు పంపించారు. పాస్‌పోర్టులను రూపొందించేందుకు నకిలీ పత్రాలను, నకిలీ చిరునామాలతో నకిలీ సర్టిఫికేట్లను తయారు చేశారు. నకిలీ పాస్‌పోర్టులను పొందిన 100 మంది శ్రీలంకకు చెందిన వారు విదేశాల్లో ఉన్నారు. వారందరి జాబితాను సేకరించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. 23వ నిందితుడి వరకు అందరూ బెయిల్‌పై విడుదలయ్యారు.

పోలీసు అవతారమెత్తి..

- మసాజ్ సెంటర్ల వద్ద డబ్బులు వసూలు
- రాయదుర్గంలో అరెస్టు

సాయికిరణ్ తేజ

సాయికిరణ్ తేజ తయారు చేసుకున్న నకిలీ ఐడీ కార్డు

శేరిలింగంపల్లి, మార్చి 12: పోలీసు అవతారమెత్తి.. మసాజ్ సెంటర్ల నిర్వాహకుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ఓ వ్యక్తిని రాయదుర్గం పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. గుడి మల్కాపూర్‌కు చెందిన మరి కొండ సాయికిరణ్ తేజ (30) సులభంగా డబ్బు సంపాదించేందుకు పోలీసు అవతారమెత్తాడు. క్రైమ్ ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్ పేరిట నకిలీ ఐడీ కార్డు తయారు చేసుకున్నాడు. ఆ కార్డు చూపించి.. తాను పోలీసునంటూ మసాజ్ సెంటర్ల నిర్వాహకులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నాడు. హైటెక్ సిటీ పరిధిలో గత కొన్ని రోజులుగా ఈ తరహా ఘటనలు వెలుగుచూడగా.. మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు నిఘా పెట్టారు. రాయదుర్గం ఫార్చున్ అపార్ట్‌మెంట్ 5వ ఫ్లోర్‌లో ఉన్న స్టార్ వెల్‌నెస్ అండ్ ఫ్యామిలీ సెలూన్‌కు సోమ, మంగళవారాల్లో వచ్చిన సాయికిరణ్ తేజ.. తాను పోలీసునంటూ యజమానిని బెదిరించారు. రూ.10 వేలు వసూలు చేస్తుండగా మాదాపూర్ ఎస్‌వోటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు నిందితుడి నుంచి రూ.10 వేల నగదు, ఓ ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, రాయదుర్గం పోలీసులకు అప్పగించారు. సాయికిరణ్‌పై కేసు నమోదు చేసిన రాయదుర్గం పోలీసులు.. అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివి

పద్మశాలిపురంలో కార్మికులకు నూతన వస్త్రాలను అందజేసి సన్మానం

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 12 : పారిశుధ్య కార్మికులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజల ఆరోగ్యాలను కాపాడుతారని రామకృష్ణా సేవా సమితి సభ్యులు అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పద్మశాలిపురంలో రామకృష్ణ పరమహంస జయంతిని మంగళవారం నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతను క్రమం తప్పకుండా చిత్తశుద్ధితో నిర్వహించే 45 మంది పారిశుధ్య కార్మికులకు సేవాసమితి ఆధ్వర్యంలో నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారి సేవలను గౌరవిస్తూ ఘనంగా సన్మానించారు. సంస్థ సభ్యులు మాట్లాడుతూ.. కార్మికులు విధులు నిర్వహించే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. పారిశుధ్య కార్మికుల సేవలను ప్రతిఒక్కరూ గౌరవించాలని సూచించారు. కార్యక్రమంలో మసున వెంకటేశ్, గంజి వెంకటేశ్, బొల్ల శ్రీనివాస్, సీహెచ్ శ్రీనివాస్, శివ, శశి, నరేందర్ పాల్గొన్నారు.